సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 23 । నవంబర్ । 2024



నిరసన గళం

కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలు వర్గాలు గళమెత్తుతున్నాయి. 8లో ▸



సీనియర్ వైద్యుల బదిలీ

ఏలూరు సర్వజన ఆస్పత్రిలో పేదలకు మెరుగైన రీతిలో వైద్య సేవలు అందడం లేదు. ఐదుగురు సీనియర్ వైద్యుల బదిలీపై విమర్శలు వస్తున్నాయి. 8లో ▸



బాబోయ్ చలి

చలి పులి ప్రజలను వణికిస్తోంది. నాలుగు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుతూ భయపెడుతోంది. జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలి



జేడీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రబీ పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, బీమా ప్రీమియం పేరుతో రైతులపై భారం వేయవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా అమలు చేశారన్నారు. అదే తరహాలో ఈ రబీ సీజన్‌లోనూ బీమా ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఇప్పటికే కనీస ధరలు రాక రైతులు నష్టపోతున్న తరుణంలో బీమా ప్రీమియం అదనపు భారంగా మారిందన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని కోరారు.

మద్యం షాపుపై మండిపాటు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కామవరపుకోట: కామవరపుకోట చెక్‌పోస్ట్ సెంటర్‌లో మద్యం షాపు ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని శుక్రవారం గ్రామస్తులు గళమెత్తారు. గ్రామంలోని చెక్‌పోస్ట్ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయం ఉందని, ఇటుగా వాహనాల రాకపోకలతో నిత్యంగా రద్దీగా ఉంటుందని, ఇక్కడ మద్యం షాపు ఏర్పాటుతో ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ షాపు ఏర్పాటు చేస్తే దశలవారీగా ఉద్యమానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కాకి సురేష్ కుమార్, టీవీఎస్ రాజు, నానాది సాగర్, అయితం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా చంద్రశేఖర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కాకినాడ నుంచి ఏలూరు జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుతం ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న వీజీ శ్రీహరిరావు కాకినాడ బదిలీపై వెళుతున్నారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారని డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. అర్హులు 6,7,8 ఫారాలు పూర్తిచేసి బీఎల్‌ఓలకు అందించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

వలంటీర్లకు సర్కారు షాక్

కూటమి కుట్ర

- వలంటీర్ల వ్యవస్థ మంగళానికి కార్యాచరణ
- 8 నెలలుగా నిలిచిన జీతాలు
- అసెంబ్లీ సాక్షిగా వ్యవస్థను రద్దు చేస్తామని మంత్రి ప్రకటన
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 20,482 మంది వలంటీర్లు
- జీతం రెట్టింపు చేస్తామని ఎన్నికల సభల్లో కూటమి నేతల హామీలు
- ఆందోళనకు సిద్ధమైన వలంటీర్లు



మంచంపై ఉన్న వృద్ధురాలికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వలంటీర్లకు కూటమి సర్కారు బిగ్ షాక్ ఇచ్చింది. వలంటీర్లు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ పథకాలన్నీ పక్కాగా ప్రజలకు చేరుస్తున్నారని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క వలంటీర్‌ను కూడా తొలగించం.. వారికి ఇస్తున్న రూ.5 వేల జీతాన్ని రూ.10 వేలు పెంచే బాధ్యత నాది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదలు లోకేష్ వరకు అందరూ ప్రతి చోటా మాట్లాడారు. ప్రధానంగా ఈ ఏడాది మే 10న ఏలూరులో జరిగిన ఎన్నికల సభలో చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను కొనియాడి జీతం రెట్టింపు చేస్తానని ప్రకటించారు. కట్ చేస్తే.. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను పూర్తిగా విస్మరించడం, చివరికి అసెంబ్లీ సాక్షిగా వలంటీర్ల వ్యవస్థే లేదని ప్రకటించడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వలంటీర్లు ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా విషం చిమ్ముతూ..

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రభుత్వం అందించే పౌర సేవలను, సంక్షేమ పథకాలను దళారీ వ్యవస్థకు తావులేకుండా వలంటీర్లు గత ప్రభుత్వ హయాంలో సమర్థవంతంగా పనిచేశారు. కరోనా వంటి విపత్తు సమయంలోనూ అద్భుతమైన సేవలందించి దేశ ప్రధాని సైతం వలంటీర్ వ్యవస్థ బాగుందని కితాబు ఇవ్వడంతో పాటు ఇతర రాష్ట్రాలు కూడా అమలుచేయడానికి వీలుగా రాష్ట్రంలో క్షేత్ర స్థాయి పర్యటనలు కూడా జరిగాయి. ఇలా దేశవ్యాప్తంగా అందరి మన్ననలు పొందిన వలంటీర్ వ్యవస్థపై ఎన్నికల ముందు నుంచే కూటమి నేతలు ప్రణాళికాబద్ధంగా విషం చిమ్మారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను గత ప్రభుత్వం నియమించి సంక్షేమ పథకాలు మొదలు కోవిడ్ వ్యాక్సిన్ల వరకు సేవలందించింది. ప్రధానంగా గోదావరి వరదల సమయంలో వలంటీర్లు క్రియాశీలక పాత్ర పోషించారు. ఏటా రోజుల తరబడి ఏజెన్సీ ప్రజలు గోదావరి వరదల్లో చిక్కుకుని పునరావస కేంద్రాల్లో ఉంటున్న పరిస్థితి. ఈ క్రమంలో వలంటీర్లే మంచినీరు మొదలు ప్రభుత్వ పరిహారం వరకు గంటల వ్యవధిలో లబ్ధిదారులకు అందించారు. ఇలాంటి బలమైన వలంటీర్ వ్యవస్థకు కూటమి సర్కారు మంగళం పాడింది.

ఉమ్మడి జిల్లాలో..

గ్రామ సచివాలయాలు	938
వార్డు సచివాలయాలు	227
గ్రామ, వార్డు వలంటీర్లు	20,482

20 వేల కుటుంబాల భవిత ప్రశ్నార్థకం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 938 గ్రామ సచివాలయాలు, 227 వార్డు సచివాలయాల పరిధిలో 20,482 మంది వలంటీర్లు గత ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 14తో వలంటీర్ వ్యవస్థ గడువు ముగిసింది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నుంచే వలంటీర్లకు జీతాలు చెల్లించలేదు. ఎన్నికల ప్రచార సభల్లో జిల్లాకు వచ్చిన చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో సహా స్థానిక ప్రజాప్రతినిధులు వరకు అందరూ వలంటీర్లు దేవుళ్లు అంటూ పొగిడారు. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచి టీడీపీ, జనసేన వలంటీర్ వ్యవస్థపై తీవ్రస్థాయిలో విషం చిమ్మింది. వలంటీర్లతో పాటు ప్రజల నుంచి తారాస్థాయిలో నిరసనలు వ్యక్తం కావడంతో వెంటనే ప్లేటు ఫిరాయించి వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, ఏ ఒక్కరి ఉద్యోగం కూడా తొలగించమని, రూ.5 వేల నెల జీతాన్ని రూ.10 వేలు చేస్తామని హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి రాగానే వలంటీర్లను విస్మరించారు. జిల్లాస్థాయిలో నిరసన వ్యక్తం చేసిన సందర్భాల్లో ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటుందంటూ మాటలతో దాటేశారు. తాజాగా అసెంబ్లీ సాక్షిగా మంత్రి లేని వ్యవస్థకు జీతాలు ఎలా ఇస్తాం.. వ్యవస్థే లేదని కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించడంతో జిల్లాలో 20,482 మంది వలంటీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిణామాల క్రమంలో ప్రత్యక్ష పోరుకు వలంటీర్లు సన్నద్ధమవుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించి, న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఏలూరులో వలంటీర్ల ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వలంటీర్లు

ఏలూరు (టూటౌన్): గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఐదేళ్లపాటు ప్రజలకు నేరుగా వలంటీర్లు సేవలందించారని, ఈ ఏడాది జూన్ నుంచి వలంటీర్లకు కూటమి ప్రభుత్వం జీతాలు నిలిపివేసిందని, ఇది సరైన విధానం కాదన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు వలంటీర్లను కొనసాగిస్తామని, వారి జీతాలు రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు పృథ్వీరాజ్, విజయ్, తన్మయ, అశోక్, మణికంఠ, హర్షలత తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

పార్టీ ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్



కైకలూరులో విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, నాయకులు

కైకలూరు: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ అన్నారు. కైకలూరులోని పార్టీ కార్యాలయంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర పదవి అందించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గోట్రూ ఏసుబాబు, ముదినేపల్లి వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, నాయకులు పాము రవికుమార్, బత్తిన కిషోర్, గంట సంధ్య, శీలం రామకృష్ణ, గోదావరి సత్యనారాయణ, గంటా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భీమడోలు సీబీసీఎస్ సీ ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్జీటీ ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించినట్టు డీఈఓ ఎం. వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో సీబీసీఎస్‌సీ ఎయిడెడ్ పాఠశాలకు వ్యక్తిగతంగా లేదా పోస్టు లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

టీడీపీ దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

- మాజీ సీఎం జగన్‌పై తప్పుడు పోస్టులు పెడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు
- వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అందజేత



ఏలూరులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన కుటుంబ సభ్యులపై, పాలనపై అత్యంత నీచంగా, అసభ్యకరంగా ఎక్స్‌లో ట్వీట్లు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన టీడీపీ నేతలపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు కోరారు. ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నేతలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులకు ఆధారాలతో కూడిన ఫిర్యాదును సమర్పించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరులోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్తలు, నేతలతో సమావేశమై పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించుకుంటూ ఉండగా.. తన సెల్‌ఫోన్‌లో ఎక్స్ మాధ్యమంలో జగన్‌ను ఉద్దేశించి కొన్ని అసభ్యకరమైన ట్వీట్లు, మార్ఫింగ్ చేసిన చిత్రాలను పోస్ట్ చేయగా చూశానని తెలిపారు. మంత్రి లోకేష్ ట్విట్టర్ ఐడీతో, ఇతర మంత్రుల ట్విట్టర్ ఐడీలతో అత్యంత దారుణంగా అసత్యాలను ప్రచారం చేస్తూ జగన్ ప్రతిష్టకు భంగం కలిగించేలా టీడీపీ నేతలు వ్యవహరించటం సరికాదన్నారు. లోకేష్ ఆధ్వర్యంలో ఐటీడీపీ ద్వారా ఈ పోస్టులు తయారుచేస్తూ సోషల్ మీడియా, ఎక్స్ మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ, కుట్రలు, కుటిల పన్నాగాలతో పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. కులాలు, మతాలు, వర్గాల మధ్య వైషమ్యాలు, విభేదాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని చెప్పారు.

వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన పోలీస్ అధికారులను కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ ఎండీ కైసర్, పార్టీ నేతలు ముదుండి సూర్యనారాయణ, లీగల్ సెల్ నాయకులు ప్రత్తిపాటి తంబి, స్టాలిన్, వీరవల్లి లక్ష్మీకుమార్, బుద్దాల రాము, ఫణి, వెంకటేష్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉరిమే ఉత్సాహం

- ఏలూరు జిల్లా పోలీస్ స్పోర్ట్స్‌మీట్
- ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బంది



వాలీబాల్ ఆడుతూ..



పరుగు పోటీల్లో పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో వార్షిక స్పోర్ట్స్‌మీట్ ఉత్సాహంగా సాగింది. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ బెలూన్లు ఎగురవేసి శుక్రవారం స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిభారం, ఒత్తిళ్లతో ప్రజలకు సేవలు అందించే పోలీసు సిబ్బంది మానసిక, శారీరక ఉల్లాసంతోపాటు ప్రతిభను చాటుకునేలా ఏలూరు జిల్లా పోలీస్ స్పోర్ట్స్‌మీట్–24ను నిర్వహించటం అభినందనీయమన్నారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణలో చాలా సమయాన్ని క్రీడల ప్రాక్టీస్‌కు వినియోగించేవారమని గుర్తుచేశారు. పోలీసు సిబ్బంది శారీరకంగా దృఢంగా ఉండాలనీ, మానసిక ఆరోగ్యం, ఉల్లాసం ఎంతో అవసరమన్నారు. క్రీడాస్ఫూర్తితో ఆటల్లో రాణించాలన్నారు. పోలీస్ సిబ్బందికి రన్నింగ్, లాంగ్‌జంప్, వాలీబాల్, షాట్‌పుట్ వంటి పలు అంశాల్లో క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ పీ.శ్రీహరి, ఎస్‌బీ సీఐలు, సీఐలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గంట తంటా

- ఉన్నత పాఠశాలల పనివేళల పెంపుతో షాక్
- దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు
- మానసిక ఒత్తిళ్లు తప్పవంటున్న ఉపాధ్యాయులు




ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థినులు

భీమవరం: రాష్ట్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారీ విద్యకు పెద్దపీట వేస్తూ విప్లవాత్మక సంస్కరణలు తీసుకురాగా.. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటీ రద్దు చేస్తూ తాజాగా ఉన్నత పాఠశాలల పనివేళలను మార్పు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ విధానం రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా పాఠశాలల పనివేళల మార్పు అంశాన్ని తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలోని 20 హైస్కూళ్లలో..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నాయి. టెన్త్ పబ్లిక్ పరీక్షల సమయంతో అదనపు తరగతులు నిర్వహిస్తుంటారు. అయితే నూతనంగా పనివేళలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచారు. దీని కారణంగా ఒక్కో పీరియడ్‌కు 5 నిమిషాల సమయం పెరగడంతోపాటు మధ్యాహ్నం విశాంత్రి సమయంలో 20 నిమిషాలు పెరిగింది. జిల్లాలోని 207 హైస్కూళ్లకు గాను మండలానికి ఒకటి చొప్పున 20 ఉన్నత పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో ఈనెల 20వ తేదీ నుంచి 30 వరకు పనివేళల పెంపు అమలు చేస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు అదనంగా ప్రయోజనం లేకపోగా దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు అవస్థలు పడతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. కళాశాలలు, పాఠశాలలు ఒకే సమయంలో ముగియడం వల్ల ఆర్టీసీ బస్సుల్లో మరింత రద్దీ పెరిగి ప్రయాణం భారమవుతుందని పలువురు అంటున్నారు. అలాగే ఎక్కువ సమయం తరగతి గదిలో ఉండటం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురవుతాయని ఉపాధ్యా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

గ్రామీణ విద్యార్థులకు అవస్థలు



పాఠశాలల పనివేళల పెంపు వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు ఎక్కువవుతాయి. దూర ప్రాంతాల నుంచి సైకిళ్లపై వచ్చే విద్యార్థినులకు భద్రత కొరవడుతుంది. ఒక్కో పీరియడ్‌కు కేవలం 5 నిమిషాల సమయం పెంచడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. పనివేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

–ఎల్.సాయిశ్రీనివాస్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

మానసిక ఒత్తిడికి గురవుతారు



పాఠశాలల పనివేళలు పెంచడం వల్ల విద్యార్థులు ఎక్కువ సమయం తరగతి గదిలో ఉంటూ మానసిక ఒత్తిడికి గురవుతారు. విశాంత్రి సమయం పెంచడం వల్ల అప్పుడు విద్యార్థులను కంట్రోల్ చేయడం కష్టమవుతుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు రాత్రి సమయంలో ప్రయాణించడం ఇబ్బందికరమే.

– జి.ప్రకాశం, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రాత్రి 7 గంటలవుతోంది



మా స్కూల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో భీమవరం మండలం పెదగరువు గ్రామం నుంచి వచ్చే విద్యార్థులు తిరిగి బస్సులో ఇంటికి వెళ్లడానికి రాత్రి 7 గంటలు అవుతుంది. పనివేళలు పెంచడం వల్ల ప్రధానంగా విద్యార్థినులకు ఎక్కువ ఇబ్బంది.

–ఎస్.వర్షిణి, విద్యార్థిని, పెదగరువు

భయంగా ఉంది



హైస్కూల్ సమయాలను పెంచడం వల్ల ఒత్తిడి ఎక్కువై అనారోగ్యం పాలయ్యే ప్రమాదముంది. ఉదయం 9 గంటలకు తరగతులకు హాజరుకావాలంటే ఇంటి వద్ద 7.30 గంటలకు బయలు దేరాలి. సాయంత్రం 5 గంటల వరకూ తరగతిలో ఉంటే ఒత్తిడి మరింత పెరిగి ఆరోగ్యం దెబ్బతింటుందని భయంగా ఉంది.

– కె.రోజలిన్, విద్యార్థిని,యమునాపల్లి

బస్సులో ప్రయాణం నరకమే



నేను రోజూ యమునాపల్లి గ్రామం నుంచి ఆర్టీసీ బస్సులో భీమవరం స్కూల్‌కు వస్తుంటాను. పాఠశాల సమయం పెంచడం వల్ల సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కళాశాల విద్యార్థులు కూడా అదే సమయంలో రావడంతో బస్సు ఎక్కడం కష్టమైపోతుంది. 4 గంటలకు స్కూల్ అయిపోతే బస్సుల్లో రద్దీ తక్కువగా ఉంటుంది.

– బి.బెస్సీ, ఆరో తరగతి, యమునాపల్లి, భీమవరం మండలం

క్లుప్తంగా

హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలి



వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

భీమవరం: ప్రభుత్వ హాస్టళ్లలో సౌకర్యాలు తప్పనిసరిగా మెరుగుపర్చాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. శాసన సభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఆయన శాసన మండలిలో మాట్లాడారు. వైఎస్ జగన్ సీఎంగా ఉండగా 2023లో అప్పటి ప్రభుత్వం హాస్టళ్ల మెస్ చార్జీలు, మెయింటెనెన్స్ చార్జీలు పెంచిందని గుర్తు చేశారు. ఇటీవల కందిపప్పు, మినప్పప్పు, వంటనూనె వంటి ధరలు 35 శాతం పెరిగాయని, అందువల్ల ప్రస్తుత ప్రభుత్వం మార్కెట్ ధరలను దృష్టిలో పెట్టుకొని మెస్ చార్జీలను వెంటనే పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించే అవకాశం లేనందున లోపాయికారీగా వంట మనిషి, స్వీపర్‌ను నియమించుకుని వారికి విద్యార్థుల మెస్ చార్జీల నుంచే జీతాలు చెల్లించడంతో విద్యార్థులకు మెనూ అమలు చేయడం కష్టతరంగా మారిందన్నారు. మెస్ చార్జీలు అంతంతమాత్రంగా ఉండటంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. దీనిపై సాంఘిక సంక్షేమ మంత్రి స్పందిస్తూ.. ఈ విషయంపై త్వరలో సమీక్ష చేసి సభ్యుల సూచనలతో విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారు.

బలుసుమూడిలో కేంద్ర మంత్రి తండ్రి అంత్యక్రియలు



తండ్రి సూర్యనారాయణరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తండ్రి సూర్యనారాయణరాజు అంత్యక్రియలు శుక్రవారం భీమవరం పట్టణం బలుసుమూడిలోని మోక్షధామంలో నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిన సూర్యనారాయణరాజు మృతదేహాన్ని శుక్రవారం ఉదయం పట్టణంలోని నర్సయ్య అగ్రహారంలోని స్వగృహానికి తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచారు. సూర్యనారాయణరాజు మృతదేహాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ ఆర్‌జే జయసూర్య వివిధ రాజకీయపార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసవర్మను పరామర్శించిన వారిలో బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులున్నారు.

తాటిచెట్టు పడి వ్యక్తి మృతి

పెదవేగి: ప్రమాదవశాత్తు తాటిచెట్టు మీద పడడంతో వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. పెదవేగి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన మట్టా పోతురాజు శుక్రవారం జేసీబీ సాయంతో తోటలో కట్టవా బాగుచేస్తుండగా ప్రమాదవశాత్తు తాడిచెట్టు మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఏలూరు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే పోతురాజు(55) మృతిచెందినట్లు నిర్ధారించారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నిరసన గళం

- ఆందోళన బాటలో భవన నిర్మాణ కార్మికులు, ఆశా వర్కర్లు, వీఏఓలు, 108, అంగన్‌వాడీ సిబ్బంది
- ఎన్నికల ముందు హామీలు నెరవేర్చాలి
- ఆరు నెలలు గడుస్తున్నా స్పందించని ప్రభుత్వం
- కలెక్టరేట్ వేదికగా ధర్నాలు, నిరసనలు

భీమవరం (ప్రకాశం చౌక్) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలంటూ పలు వర్గాలు నిరసన గళమెత్తాయి. భవన నిర్మాణ కార్మికుల నుంచి అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వీఓఏలు, 108 ఉద్యోగుల వరకు కలెక్టరేట్‌లో ధర్నాలు, నిరసనలతో గళమెత్తుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్నా హామీలపై స్పందించడం లేదు. దీంతో విసుగు చెందిన ఉద్యోగులు, కార్మికులు ధర్నాలు, సమ్మె బాట పడుతున్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన

గత ప్రభుత్వం ఆశల సమస్యలపై చర్చించి రాతపూర్వకంగా ఇచ్చిన మినిట్స్ అమలు చేయాలని కోరుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో ఇచ్చిన సర్క్యులర్‌లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని వాటిని సరిచేయాలని, ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడంలో గందరగోళ పరిస్థితి ఉందని చెబుతున్నారు. కనీస వేతనాలు చెల్లించాలని రూ. 60 వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్ జీవో అమలు చేయాలని, గ్రూపు బీమా, 62 ఏళ్లకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలి: వీఓఏలు

వెలుగు విభాగంలో పనిచేస్తున్న వీఓఏ(యానిమేటర్స్)లు అనేక సమస్యలపై నిరసన గళం వినిపించారు. ప్రభుత్వం వారికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. జీతాలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నారు. మహిళా మార్ట్‌ల్లో బలవంతపు సరుకుల కొనుగోళ్లు ఆపాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు, గ్రూపు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికుల ఇక్కట్లు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇసుక పాలసీ మారుస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ అమలు చేసి ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేస్తున్నారు. గత 5 నెలలుగా ఇసుక లేక భవన నిర్మాణ రంగం కుదేలైంది. కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక సరఫరా సక్రమంగా చేయాలని, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం లేకుండా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సమ్మెకు వెళ్లే యోచనలో 108 ఉద్యోగులు

తమ సమస్యలు పరిష్కరించాలని 108 ఉద్యోగులు ధర్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈ నెల 25 దాటిన తర్వాత సమ్మెకు వెళ్లే అవకాశం ఉంది. 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, 8 గంటల పనివిధానం అమలు చేయాలని కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన జీవో 49ను అమలు చేయాలని, 108కు శాశ్వత భవనాలు, బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని, 25 లక్షల ఎక్స్‌గ్రేషియా తదితర డిమాండ్లు చేస్తున్నారు.

సమాన వేతనాలు అందించాలి: మినీ అంగన్‌వాడీలు

మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తల మాదిరిగా అన్ని పనులు చేస్తున్న తమకి వారితో సమానంగా వేతనాలు అందించాలని.. పదోన్నతులు కల్పించాలని.. తమ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేసి జీవో ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టులకు అర్హత కల్పించాలని మినీ అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నారు.



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు(ఫైల్)



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఏఓలు



సమస్యల పరిష్కరించాలని ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బకాయి జీతాలు చెల్లించాలి



108 ఉద్యోగుల శ్రమను గుర్తించి వారి డిమాండ్‌లు పరిష్కరించాలి. సకాలంలో జీతాలు ఇవ్వడం, 108 ఉద్యోగులు వేగంగా వెళ్లే సమయంలో ఏదైన జరిగితే ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం, ప్రభుత్వమే నేరుగా 108 వ్యవస్థను నడపాలని కోరుతున్నాం. జీతాలు బకాయిలు పెట్టడం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

– బి.రత్న సాగర్, 108 ఉద్యోగుల జిల్లా జనరల్ సెక్రటరీ

ఉద్యోగ భద్రత కల్పించాలి



వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి. హెచ్‌ఆర్ పాలసీ, గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలి. వారికి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. ముఖ్యంగా రాజకీయ వేధింపులు ఆపాలి, అక్రమ తొలగింపులు నిలుపుదల చేయాలి.

– ఎ.నిర్మలదేవి, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వం, అధికారులు అప్పగించే ప్రతి పనిని నిర్వర్తిస్తున్న ఆశలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. కనీస వేతనం, ఉద్యోగ భద్రత ఉండాలి. కింది స్థాయి అధికారుల ఒత్తిడి, రాజకీయ వేధింపులకు గురవుతున్నారు. ఈ సమస్యపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలి.

–డి.జ్యోతి, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా సెక్రటరీ

ఐదుగురు సీనియర్ వైద్యుల బదిలీ

ఏలూరు జీజీహెచ్‌లో వైద్య సేవలందక ఇక్కట్లు

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పేదలకు మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించే పరిస్థితి కానరావడం లేదు. ఆస్పత్రి నుంచి ఐదుగురు సీనియర్లను బదిలీ చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆసుపత్రికి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాదిమంది ప్రజలు వైద్యం కోసం వస్తూ ఉంటారు. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర కేసులు వస్తూ ఉంటాయి. గుండె సంబంధిత వ్యాధులు, న్యూరో, గైనకాలజీ, కంటి సంబంధిత వైద్య చికిత్సలు కీలకంగా ఉంటాయి. అత్యవసర స్థితిలో రోగుల ప్రాణాలు రక్షించేందుకు సీనియర్ వైద్య నిపుణుల అవసరం ఎంతైనా ఉంటుంది. ఏలూరు జీజీహెచ్ చీఫ్‌గా డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు చాలా కాలంగా అత్యుత్తమ స్థాయిలో సేవలు అందిస్తున్నారు. ఇక ట్రామాకేర్, అత్యవసర కేసులను న్యూరో సర్జన్ డాక్టర్ రవికుమార్ చూస్తున్నారు. ఆయన బదిలీ అయితే అత్యవసర స్థితిలో ఎవరైనా రోగులు వచ్చినా పట్టించుకునే నాథుడే లేదంటున్నారు. డాక్టర్ బీ.రవికుమార్‌ను చింతలపూడి, డాక్టర్ పీ.శ్రీనివాస్‌ను నూజివీడు బదిలీ చేశారు. అలాగే మరో ముగ్గురు సీనియర్ వైద్యులు డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావును నూజివీడు, డాక్టర్ లెటోర్న దేవిని నరసాపురం, డాక్టర్ ఏఎస్ రామ్ తణుకు బదిలీ చేయటం సరికాదంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)

మామిడి మొక్కల నరికివేత

నూజివీడు: గత 30 ఏళ్లగా మామిడి తోటలు వేసుకొని సాగు చేసుకుంటున్న భూముల్లోని మామిడి మొక్కలను నిర్లక్ష్యంగా అటవీశాఖ సిబ్బంది నరికివేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు మండలం మిట్టగూడెం, హనుమంతులగూడెం గ్రామస్తులు ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట అటవీ ప్రాంతంలో 30 ఏళ్లగా మామిడి మొక్కలు నాటుకుని జీవనం సాగిస్తున్నారు. వీటిలో కొన్ని చెట్లు పెద్దగా పెరిగి కాపు సరిగా కాయకపోవడంతో వాటిని నరికివేసి మళ్లీ మామిడి మొక్కలు వేసి పెంచుకుంటున్నారు. ఐదుగురు రైతులు దాదాపు 12ఎకరాల్లో నాటుకున్న మూడేళ్ల వయస్సున్న 200 మామిడి మొక్కలను రెండు రోజుల క్రితం అటవీశాఖ సిబ్బంది నరికివేయడం దారుణమని వాపోతున్నారు. మిట్టగూడెంకు చెందిన వెలివల నాగరాజు రెండు ఎకరాలు, అతని అన్నకు రెండెకరాలుండగా ఈ నాలుగెకరాల్లో మొక్కలు వేసుకొని పెంచుకుంటుంటే అటవీశాఖ అధికారులు నరికివేశారని వాపోయారు. అదే గ్రామానికి చెందిన మట్టా పుల్లయ్య, అతని ఇద్దరు కొడుకులు కలిసి నాలుగు ఎకరాలు సాగు చేసుకుంటూ మామిడి మొక్కలు నాటుకొని పెంచుకుంటుంటే వాటిని నరికేశారు. తమకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మామిడి మొక్కలు నరికిన ప్రాంతం పరిశీలిస్తున్న రైతులు

బాబోయ్ చలి.. జాగ్రత్తలు తప్పనిసరి

భీమవరం (ప్రకాశం చౌక్)/భీమడోలు : చలి పులి ప్రజలను భయపెడుతుంది. గత మూడు రోజులుగా క్రమేపి రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం 5 గంటలకే వాతావరణం పూర్తిగా చల్లబడిపోతుంది. దీంతో ప్రజలు సాయంత్రం నుంచి బయటకు తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో చలి వల్ల జలుబు, శ్వాసకోశ సంబధిత వ్యాధులు, జ్వరాల బారిన పడే అవకాశం ఉందని, చిన్నారులు, వృద్ధులు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నవారు చలి నుంచి రక్షించుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. కోవిడ్ సోకి బయట పడిన వారు ఈ చలి కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. ముఖ్యంగా చలికాలంలో శ్వాస నాళాలు ముడుచుకుపోయే అవకాశం ఉంటుందని, గాలిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉంటుందని తగిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు తీసుకుంటే చలి నుంచి రక్షించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

- శీతాకాలంలో చర్మం పొడి బారిపోతుంటుంది. మాయిశ్చరైజర్లు తప్పనిసరిగా వినియోగించాలి.
- చలికాలంలో చాలామంది నీరు తాగడం తగ్గిస్తారు. అలా చేయకూడదు. తగిన మోతాదులో మంచినీళ్లు తీసుకోవాలి.
- ఐస్‌క్రీమ్‌లు, చల్లని నీరు, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి.
- వేడి ఆహారం తీసుకోవాలి. నిల్వ ఉన్న ఆహారం, మాంసాహారం బాగా తగ్గించాలి.
- గోంగూర, వంకాయ, కొబ్బరికాయ పడినవారు ఈ కాలంలో తినడం తగ్గించాలి.
- ఎండు చేపలు తినడం మానేయాలి. దీనిలో అధికంగా ఉండే ఉప్పు ఇబ్బందికరంగా మారుతుంది.
- దుమ్ము, ధూళి ఉండే ప్రాంతాలకు దూరం ఉండాలి. చలిగాలుల్లో తిరగకుండా ఉండడం మంచిది.
- ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్ ఏడాదికి ఒకసారి, న్యూమోనియా వ్యాక్సిన్ ఐదేళ్లకు ఒకసారి వైద్యుల సూచనలతో వేసుకుంటే మంచిది.
- ఇండోర్ వ్యాయామం, జిమ్ చేసే విధంగా ప్లాన్ చేసుకోవాలి.
- వృద్ధులు, పిల్లలు చలిలో తిరగకుండా చూడాలి.
- రాత్రిళ్లు చలిలో ప్రయాణాలు చేయరాదు. అత్యవసరం అయితే వేడిని శరీరానికి అందించే ఉన్ని దుస్తులు ధరించాలి.
- ఇంటిలో ఎవరికైనా జలుబు, దగ్గు వస్తే వైద్యుల సూచనలతో మందులు వాడాలి. సొంత వైద్యం సరికాదు. కుటుంబంలో ఒకరికి వాడే ఔషధాలు వేరొకరికి వినియోగించడం సరికాదు.
- శీతాకాలంలో శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.



భీమవరంలో చలికి రక్షణగా ఉన్ని దుస్తుల విక్రయాలు

జాగ్రత్తగా ఉండాలి



శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలి. చలి నుంచి శరీరాన్ని రక్షించుకోవాలి. ఈ కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే సీ విటమిన్ కలిగిన పదార్థాలు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తీసుకుంటే మంచిది. ముఖ్యంగా గతంలో కోవిడ్ బారినపడిన వారు, శ్వాసకోశ వ్యాధులు, గుండె సమస్యలు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. అనారోగ్య సమస్య వస్తే వెంటనే స్థానిక పీహెచ్‌సీ, లేదా ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందాలి.

– డాక్టర్ డి.మహేశ్వరరావు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, భీమవరం

కామవరపుకోటలో రెండు షాపుల్లో చోరీ

కామవరపుకోట: ఒక షాపు షట్టర్ తెరిచి, మరొక షాపు కిటికీ తొలగించి దొంగలు నగదు చోరీ చేసిన సంఘటన గురువారం రాత్రి కామవరపుకోట కొత్తూరులో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోటకు చెందిన యన్నంశెట్టి గాంధీ బాబు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సాయిరాం ఆటో మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం షాపు తెరిచి చూసేసరికి వెనుక ఉన్న షట్టర్ తెరిచి ఉండటం చూసి షాపులోకి వెళ్ళగా రూ.70,000 నగదు చోరీకి గురైందని బాధితుడు తెలిపాడు. వడ్లమూడి జగదీష్ సొసైటీ పెట్రోల్ బంక్ ఎదురుగా శ్రీ సూర్య ఆగ్రో పురుగుమందుల షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లి, ఉదయం వచ్చి షాపు తెరవగా కిటికీ ఊచలు తొలగించి 20,000 నగదు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సై ఆనందరావు, హెడ్ కానిస్టేబుల్ శంకరరావు ఆధ్వర్యంలో వేలు ముద్రలు సేకరించారు.



ఎరువుల షాపులో చోరీపై వివరాలు సేకరిస్తున్న ఎస్సై చెన్నారావు

ఆయుధ కర్మాగారంపై ఎంపీ ప్రకటన సరికాదు

ఏలూరు (టూటౌన్): ఆయుధ కర్మాగారం విషయంలో ఏలూరు ఎంపీ ప్రకటనను సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటన విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో రూ.2 వేల కోట్లతో నౌకా విభాగానికి అవసరమైన ఆయుధాల పరిశ్రమకు జనవరి లేదా ఫిబ్రవరిలో శంకుస్థాపన చేస్తామని ఎంపీ ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పరిశ్రమను వద్దని ముక్తకంఠంతో కోరుతున్నారని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టులో నిర్వాసితులైన లక్ష కుటుంబాల్లో కేవలం 10 వేల కుటుంబాలకు కూడా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని, వీరికి నేటికీ ప్యాకేజీ దక్కక, ఇళ్ళు పూర్తికాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆయుధ పరిశ్రమ పెట్టవద్దని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించినా ఎంపీ ఈ విధంగా ప్రకటనలు చేయడం ఆయనకు తగదన్నారు. ఊళ్లో ఫ్యాక్టరీ పెట్టవద్దని ముక్తకంఠంతో చెబుతున్నా పెట్టి తీరుతానని చెప్పే హక్కు ప్రభుత్వానికి ఉండదన్నారు. పరిశ్రమను స్థాపిస్తే వంకావారిగూడెం పంచాయతీలోని 6 గ్రామాలకు చెందిన 3 వేల మంది నిరాశ్రయులవుతారని తెలిపారు. ఇది ప్రైవేటు పరిశ్రమని.. ఎలాంటి రిజర్వేషన్లు పాటించరని, ఇప్పటికే షెడ్యూల్ గిరిజనులకు వంద శాతం ఉద్యోగాలిచ్చే జీవో నెం.3 రద్దయిందన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తానాలకుంట పరిధిలోని చాపరాయి కొండ సమీపంలో దాడులు చేశామని ఎక్సైజ్ సీఐ ఆర్.సత్యవతి తెలిపారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎస్సై జి.సునీల్‌కుమార్, పోలవరం స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

8 మందిపై బైండోవర్ కేసులు



తహసీల్దార్ కార్యాలయంలో 8 మందిని బైండోవర్ చేసిన ఎక్సైజ్ సిబ్బంది

ఆగిరిపల్లి: మండలంలో పలు గ్రామాలకు చెందిన 8 మందిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. మండలంలో అక్రమంగా నల్ల బెల్లం అమ్ముతున్న యండురి అప్పారావు, కలిదిండి జగదీశ్వర్‌రావును బైండోవర్ చేశారు. బెల్టు షాపు నిర్వాహకులు కొండేటి నాగరాజు, పరసా జమలయ్య, పరసా కొండలరావు, దొండపాటి ఆంజనేయులు, గుంజి గంగా, బాణాల చక్రంను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష పాయలు జరిమానా విధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు.

వేధింపుల కేసులో భర్తకు పదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో నేరం రుజువు కావడంతో ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. 2016లో నమోదైన ఈ కేసులో లింగపాలెం మండలం బాదరాలకు చెందిన దొండపాటి కోటేశ్వరరావుకు మృతురాలు ప్రభావతికి 2010లో వివాహం జరిగింది. ప్రభావతితో వివాహం కాకముందు నుంచే కోటేశ్వరరావుకు వివాహేతర సంబంధం ఉండడంతో పాటు.. భార్యను వేధింపులు గురి చేసేవాడు. పలుమార్లు పెద్దల్లో పెట్టి నచ్చజెప్పినా కోటేశ్వరావులో ఏమాత్రం మార్పు రాలేదు. భర్త వేధింపులతో మనస్తాపానికి గురైన ప్రభావతి ఇద్దరు పిల్లలతో కలిపి 2016 ఏప్రిల్ 16న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రభావతి, ఆమె కుమార్తె చనిపోగా కుమారుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

వేధింపుల కేసు నమోదు

టి.నరసాపురం: వేధింపులపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన పరసా వెంకటేశ్వరరావు అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మిని 2015లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. మద్యానికి బానిసైన వెంకటేశ్వరరావు తాగొచ్చి కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడని, వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసింది.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

పాలకోడేరు: పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని, కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం గరగపర్రు రైతు సేవా కేంద్రాన్ని, మిల్లులకు తరలిస్తున్న ధాన్యం లారీలను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడుతూ మీకు సకాలంలో గోనె సంచులు ఇచ్చారా, ధాన్యం డబ్బులు జమ అయ్యాయా అని అడిగగా రైతులు చెప్పిన సమాధానంతో జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరను పొంది ఆర్థికంగా బలపడాలని రైతులకు ఆయన సూచించారు. రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేసే సమయంలో తూకం, తేమశాతం, రికార్డుల నిర్వహణ, డేటా ఎంట్రీలను జేసీ పరిశీలించారు. గోనె సంచుల గోదామును పరిశీలించి చిరిగిన గోనె సంచులను వేరే చోట పెట్టాలని ఎట్టి పరిస్థితుల్లో చిరిగిన గోనె సంచులను రైతులకు ఇవ్వరాదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ భారతి విజయలక్ష్మి పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



వీరంపాలెంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 10వ తేదిన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించ తలపెట్టామని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం మండల గౌరవాధ్యక్షుడు సీహెచ్. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



సత్యసాయి ఆలయంలో సేవా సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయిబాబా జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక డీఎస్ చెరువు వద్ద సత్యసాయి మందిరంలో సేవా సమితి మందిర కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.వెంకట్రావు, సూపర్‌వైజర్ జి.దానయ్యలు హాజరైయారు. విద్యార్థులచే గత మూడు రోజులుగా మందిరంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. సవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, విష్ణుమూర్తి, గాదె శ్రీరామచంద్రమూర్తి, శోభనాద్రిరావు, గ్రంధి సాయి, సతీష్, రమాదేవి, అన్నపూర్ణ, లక్ష్మీకుమారిలు మాట్లాడుతూ 23వ తేదీ శనివారం ఉదయం సత్యసాయి వ్రతాలు, మహాఅన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మెడంకల చంద్రయ్య (70)

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీ గుండె పోటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మెడంకల చంద్రయ్య (70) రోజు మాదిరిగానే ఉపాధి హామీ పథకం కూలీ పనులకు వెళ్లాడు.అయితే పని చేస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. దీంతో అతనిని స్థానికంగా ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించాడు. మృతునికి భార్య కలదు.


రైతులు అప్రమత్తంగా ఉండాలి



దువ్వలో కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో కుసుమ

తణుకు టౌన్: రానున్న రెండు రోజుల్లో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏఓ కె కుసుమ సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు కోసిన పంటను చేలల్లో విడచి పెట్టకుండా వెంటనే ఒబ్బిడి చేసుకోవాలన్నారు. వీలైతే తుఫాన్ అనంతరం వరికోత పనులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

ఘనంగా శివాలయంలో పూజలు



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని చిన్న శివాలయంలో శుక్రవారం కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు చేశారు. అర్చకులు పూజ్యం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పలు గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- ప్రధాన ప్రాంతాల్లో కనిపించని పరిశుభ్రత
- సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతం
- నిర్లక్ష్యం వీడని అధికార యంత్రాంగం



పెంటపాడు మెయిన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



వెలంపేటలో పిచ్చి మొక్కలు అలుముకున్న డ్రెయినేజీ

పెంటపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ గొంగలి అక్కడే అన్నట్లు మండలంలో ఏ గ్రామంలో చూసిన పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలు, చెత్త కుప్పలు ఎక్కువగా పేరుకుపోవడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం అటువైపు కన్నెత్తైన చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామ వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సర్పంచ్‌లు ఏ పనిచేయాలన్నా తమకు చెప్పి చేయాల్సిందే అని అధికారులకు అధికార పార్టీ మద్దతు ఉన్న సర్పంచ్‌లకు హుకుం జారీ చేయడంతో పంచాయతీలల్లో నిధులు ఉన్న సర్పంచ్‌లు గ్రామాధికారులు ఎటు చెప్పాలో తెలియక గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శీత కన్ను వేశారు. ఒక వైపు వ్యాధుల కాలం ప్రజలు సీజనల్ వ్యాధులు జ్వరాలు, డయేరియా, మలేరియా వంటి రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గ్రామాల్లో మురుగు నీటి కాలువలలో పూడిక తీసి వాటర్ ట్యాంకులను నిర్ణీత సమయానికి క్లోరినేషన్ చేయడం, బ్లీచింగ్ చల్లి గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి చెత్త పోస్టు ద్వారా ఎరువులు తయారు చేసేవారు. ప్రతి ఇంటికి వెళ్లి సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తు ఫీవర్ సర్వే చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పారిశుద్ధ్యం చర్యలు గాలికొదిలేశారు. పల్లపు ప్రాంతాల్లో కాలువల్లో నీరు అధికంగా చేరి చెత్త చెదారం కుళ్లిన వ్యర్థాలతో నీరు రోడ్లపై ప్రవహించడంతో దోమలు పెరిగి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో అధికారులు తూతూ మంత్రంగా మురుగునీటి కాలువల్లో పూడికలు తీసి చెత్తను వేరే ప్రాంతాలకు తరలించకుండా మళ్లీ అదే ప్రదేశంలో చెత్తను వేయకుండా నిరోధించడానికి అధికారులు పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకొంటారని కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఇరగవరం: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు రైతులకు సూచించారు. శుక్రవారం ఇరగవరం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ ఖరీఫ్ సజన్‌కు సంబంధించి 13.347ఎకరాల్లో వరి పంట సాగు చేశామన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు సేకరణ ప్రారంభించామన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే గోనే సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులను ఆశ్రయించకుండా ధాన్యాన్ని 17శాతం తేమ వచ్చే వరకు విక్రయించుకోవాలన్నారు.

ఐశ్వర్య దుర్గామాతకు విశేష పూజలు

అత్తిలి: మండలంలోని రామన్నపేటలో గల శ్రీ ఐశ్వర్య దుర్గా మాతకు శుక్రవారం విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై అమ్మ వారికి కుంకుమార్చనలు చేశారు. ఈసందర్భంగా పోలిశెట్టి చంటి సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ ఎండీ మనజీర్ జిలాని



పెంటపాడులో రైతులతో మాట్లాడుతున్న దృశ్యం

పౌరసరఫరాల శాఖ ఎండీ డాక్టర్ మనజీర్ జిలాని

తాడేపల్లిగూడెం: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌరసరఫరాల విభాగం వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన గూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలలో పర్యటించారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రయోజనాలను గురించి రైతులకు వివరించారు. సీఎంఆర్ డెలివరీలను ప్రభుత్వం నిర్దేశించిన 90 రోజుల కాలవ్యవధిలో అందించాలని మిల్లర్ల యాజమాన్యాలకు చెప్పారు. గూడెం పట్టణంలోని సీడబ్ల్యూసీ బఫర్ గోదామును సందర్శించారు. బియ్యం డెలివరీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. బియ్యం సేకరించి, నిల్వ చేసి, ఇతర జిల్లాలకు పంపిచాల్సి వస్తే వెంటనే పంపించాలన్నారు. ధాన్యం సేకరణలో గోనెసంచులు, హమాలీల సర్దుబాటు, రవాణాలో ఏ విధమైన అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులను కోరారు. పెంటపాడు. గూడెం మండలాలలో కోతకు వచ్చిన పంట పొలాలు, నూర్పిడి కళ్లాలు, రైస్‌మిల్లులు, గోదాములను సందర్శించి, రైతులు, మిల్లర్లతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్ఓ యన్.సరోజ, జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్. వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు ఏడిదకోట శ్రీనివాసు, యం.సునీల్‌కుమార్, ఏడీఏ పీ.మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి

పెంటపాడు: రైతులకు కచ్చితంగా కనీస మద్దతు ధర వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల విభాగం వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రత్తిపాడులో కోతకు వచ్చిన పంటను పరిశీలించి, అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం సేకరణలో గన్నీలు, హమాలీలు, రవాణాలో ఏవిధమైన అసౌకర్యం కలగకుండా రైతులకు ప్రయోజనం చేకూరేలా అధికారులందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రంలో సిబ్బంది నిర్ధారించిన తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలే తప్ప రైసు మిల్లర్లు తమ మిల్లు వద్ద తేమ శాతాన్ని లెక్కించి తేడా ఉందని రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఆదేశించారు. రైతులు తమకు నచ్చిన మిల్లులకే ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు.

తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌ను పరిశీలించిన సీడీసీ బృందం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సేఫ్‌కేర్ సెంటర్ వైద్యవర్గంతో సీడీసీ బృందం

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని సేఫ్‌కేర్ సెంటర్‌ను శుక్రవారం సెంటర్ ఫర్ డిసీజ్ (సీడీసీ) కంట్రోల్ బృందం పర్యటించింది. కేంద్రంలో హెచ్ఐవీ రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని 54 సెంటర్‌లలో తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో అత్యున్నత సేవలు అందుతున్నాయని, రోగుల్లో 99 శాతం వైరల్ లోడ్ అదుపులో ఉన్న ఏకైక సెంటర్‌గా తణుకు సేఫ్‌కేర్ సెంటర్ నిలిచిందని బృందంలోని సీడీసీ కంట్రీ డైరెక్టర్ డాక్టర్ పాట్రిక్ నాదోల్ అన్నారు. ఈ సందర్భంగా సెంటర్‌లో రోగులు బరువు, బీపీ పరీక్ష చేసుకునే విధానం అమలు తీరును పరిశీలించారు. హిమోగ్లోబిన్, ఆర్‌బీఎస్ పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, బృందం వైద్యులు అట్లాంటా సీడీసీ డాక్టర్ స్టీవెన్ హాంగ్, సీడీసీ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ రమేషరెడ్డి అల్లం, డాక్టర్ సుధీర్ చావ్లా, షేర్ ఇండియా ఏపీడీ డాక్టర్ జయకృష్ణ, ఎస్‌టీవో డాక్టర్ ప్రభు, ఎస్‌పీవో అజిత్, పీవో జగదీష్, సేఫ్‌కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ఎస్. సత్తిరెడ్డి, సేఫ్‌కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిరపరపు రంగారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక చట్టాలైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు డిమాండ్ చేశారు. బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ఉల్లిపాయలు మార్కెట్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజా సమస్యలపై సీఐటీయూ నాయకులచే నిరసన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన నాలుగు సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా అన్ని కలెక్టరేట్ కార్యాలయాలలో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చల్ల చంద్రరావు, బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావులు మాట్లాడుతూ నేషనల్ మోనిటైజేషన్ విధానం రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, రైతులకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమం అమలు చేయాలని, పాత పెన్షన్ పథకం అమలు చేయాలని, నిత్యావసర వస్తువులపై జీఎస్టీ రుద్దు చేయాలని, పెట్రోలు, గ్యాస్ ధరలు గణనీయంగా తగ్గించాలని, విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని తదితర డిమాండ్లును అమలు చేయాలని కోరారు. ఈ ధర్నాలో కరక వెంకట్రావు, బేతా అప్పారావు, కేతిరెడ్డి అప్పన్న, గొర్ల రమేష్ పాల్గొన్నారు.

వేడుకగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొండ: కార్తీకమాసం సందర్భంగా పెనుగొండలో ప్రసిద్ధి గాంచిన శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం లక్షపత్రి పూజ వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు ఆలయ అర్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేద పండితుడు రామడుగుల నరసింహమూర్తి, అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితులు మునుకుట్ల రామలింగేశ్వరరావు సూర్య నమస్కార పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లురావు పర్యవేక్షించారు.

24న రంగస్థల కళాకారుల కార్తీక వన సమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ గౌరవాధ్యక్షురాలు దేవికారాణి ఉడయార్ సౌజన్యంతో ఈ నెల 24వ తేదీ ఆదివారం స్థానిక హౌసింగ్‌బోర్డు దేవికారాణి శిల్పాశ్రమంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాసా బాబూరావులు వెల్లడించారు. ఆర్టీఏ కమిషనర్ ఐ.రాజా, డీపీఆర్ఓ టీ నాగేశ్వరరావులు పాల్గొంటారని తెలిపారు. సంఘ సభ్యులచే కార్తీకదామోదర పూజ, భక్తి సంగీత విభావరి, బుర్రకథ, ట్రాక్ సినీ సంగీత విభావరి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

24న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్

తణుకు అర్బన్: కార్తీకమాసం సందర్భంగా సంకల్పం 2024 పేరుతో కులం, మతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ బొల్లా చెప్పారు. తణుకు లయన్స్ క్లబ్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24వ తేదీన స్థానిక జాతీయరహదారి సమీపంలోని భోగవల్లి బాపయ్య, అన్నపూర్ణమ్మ కమ్మ కల్యాణ మండపంలో ఉదయం 8.30 గంటల నుంచి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మొదలవుతుందని ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా 150 మంది వైద్య బృందంతో నిర్వహించే భారీ వైద్య శిబిరంలో దివ్యాంగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. వారికి ఆటలపోటీలు, నృత్యాలు, స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా వారి నైపుణ్యాన్ని చూపడంతోపాటు జాబ్ ఫెయిర్‌లో హాజరయ్యే కొన్ని కంపెనీల ద్వారా దివ్యాంగుల్లో విద్యార్హత వారి ప్రతిభ ఆదారంగా ఉద్యోగాలు ఇచ్చే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే దివ్యాంగుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో వాహనాలు ఏర్పాటు చేసి కల్యాణ మండపానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేశామని, ఆత్మీయ సమ్మేళనం రోజున హాజరయ్యే సుమారు 6 వేల మంది దివ్యాంగులకు సేవలు చేసేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వలంటీర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత 14 సంవత్సరాలుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రైసైకిల్స్, వీల్‌చైర్స్, ఆర్థికసాయం, కిరాణా దుకాణాలు, కిళ్లీ దుకాణాలు వంటి సేవలతో దివ్యాంగులకు ఆసరాగా నిలవగలిగినందుకు చాలా సంతోషపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు సృష్టి సుబ్బారావు, దేవులపల్లి వేణుగోపాల్, మానేపల్లి కాశీవిశ్వేశ్వరరావు, గూడూరి రామకృష్ణ, వేంద్ర లక్ష్మణ్, సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, దివ్యాంగులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశి

అత్తిలి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. మండలస్థాయి ప్రొక్యూటర్‌మెంట్ కమిటీ సమావేశం తహసీల్దార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలలో విక్రయించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని చెప్పారు. ఇప్పటికే మండలంలో దళారులను, మధ్యవర్తులను, కమిషన్‌దారులను గుర్తించామన్నారు. ఎవరైనా రైతులను ప్రలోభాలకు గురిచెయ్యాలని చూస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, సహకార అధికారి, సొసైటీ ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

గండం నుంచి గట్టెక్కేనా?

- కోతల వేళ వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికలు
- మారిన వాతావరణంతో ఖరీఫ్ రైతుల్లో ఆందోళన
- ప్రస్తుత సీజనల్‌లో సాగుబడి కంటే ప్రకృతితోనే పోరు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయ నిపుణులు



ఇరగవరంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

ఇరగవరం: ప్రస్తుతం ఖరీఫ్ సీజనల్‌లో చుక్కానిలేని నావలా తయారైంది రైతన్నల పరిస్థితి. ఎప్పుడు తుపాను వస్తుందో తెలియక అన్నదాతలు నిత్యం ఆందోళన చెందుతున్నారు. వరిసాగుకోసం నాట్లు వేసిన నాటి నుంచి తుపాన్లతోనే రైతన్నలు పోరు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. జూలై, సెప్టెంబరు, అక్టోబర్‌లో తుపాన్లు, అధిక వర్షాలతో రైతులు చాలా వరకు నష్టపోయారు. నవంబర్ రెండో వారం నుంచి కోతల ప్రారంభించి, పంటను ఒబ్బిడి చేసుకోవచ్చని ఆశలు పెట్టుకొని మసూళ్లు ప్రారంభించిన రైతన్నలకు..వాతావరణంశాఖ ప్రకటన కునుకులేకుండా చేస్తోంది.

వాతావరణ మార్పులు

మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణ మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశమంతా మేఘావృతంగా మారింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రబీ విత్తనాల కోసం కొందరు రైతులు వరిచేలు కోతలు ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా అందుబాటులోకి రావడంతో మసూళ్లు ప్రారంభమయ్యాయి.

వర్షాలు వస్తే నష్టమే

ప్రస్తుతం వరిచేలు గింజలు తోడుకుని కోతకు సిద్ధమయ్యే దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన వెదజల్లు ద్వారా సాగు చేపట్టిన పొలాల్లో చేలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. మరో వారం రోజుల్లో దాదాపుగా అన్ని చోట్లా కోతలకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధిక వర్షాలు పడితే ఆ ప్రభావం రైతులపై తీవ్రంగా ఉంటుంది. వర్షాల వలన వరిచేలు నేలను తాకడం, గింజలు రాలి పోవడం పాటు తడిసిన ధాన్యం రంగు మారడం వంటి జరుగుతాయి. దిగుబడిపైన ప్రభావం పడుతుంది.

సాగుతీరిలా

తుఫాన్ల కారణంగా తరచూ వరిచేలు ముంపునకు గురవ్వడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు మరోసారి వానలు కురిస్తే..పంట కోత సమయంలో ఇబ్బందికరమని పలువురు రైతులు వాపోతున్నారు. మరో వైపు సీజన్ ముగింపు దశలో ఉన్నా పెట్టుబడి సాయం ఇంకా అందించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

సూచనలు పాటించాలి



ఖరీఫ్ వరిచేలు కోతలకు సిద్ధమయ్యాయి. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని తెలియజేయడంతో రైతులు వరి చేల కోతలపై అప్రమత్తంగా ఉండాలి. రెండు, మూడు రోజుల తరువాత మసూళ్లు ప్రారంభిస్తే మంచిది.

– రాఘవేంద్రరావు, వ్యవసాయాధికారి ఇరగవరం

ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలి



మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో ఆరోగ్య కార్యకర్తలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికొకసారి డ్రైడే పాటించాలని సూచించారు. తద్వారా దోమల నుంచి వచ్చే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు టి.మణి, కార్యకర్తలు అరుణ కుమారి, ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త కనక మహాలక్ష్మి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు అమ్ములు, రామాభాయ్, వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.